

జిల్లాకు చేరిన 2,600 మెట్రిక్ టన్నుల యూరియా

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాకు గురువారం 2,600 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి తెలిపారు. అందులో 1,820 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, 780 మెట్రిక్ టన్నులు డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్‌కు కేటాయించిన వాటిలో వెంటనే 41 రైతు సేవాకేంద్రాలకు, ఐదు సొసైటీలకు 933 మెట్రిక్ టన్నులను చేరవేశారన్నారు. యూరియా గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

భూసేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలి: కలెక్టర్



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి పారిశ్రామిక ప్రగతి కోసం చేపట్టే భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమావేశం అయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ పరిశ్రమలు, విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. భూసేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో రైతులు, అసైన్‌దారులతో సమన్వయం చేసుకుని స్పష్టమైన నివేదికలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కుసుమ్ ప్రాజెక్ట్ కోసం మిడ్తూరులో 162 ఎకరాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుల కోసం రుద్రవరం, చాగలమర్రి, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో 315 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెన్యువల్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం డోన్, బేతంచెర్ల ప్రాంతాల్లో 2,860 ఎకరాలు, ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు కోసం సుగాలిమెట్టలో 49 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పెట్టుబడులు, పరిశ్రమలు సజావుగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆర్డీవోలు విశ్వనాథ్, నరసింహులు, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వ్యయసాయం

అన్నదాతకు వ్యవసాయం వ్యయమయం కావడంతో పలు పంటలపై ఆసక్తి చూపడం లేదు. పలురకాల పంటల సాగు భారీగా తగ్గిపోయింది. ఒకప్పుడు వేరుశనగ, పత్తి సాగుకు పేరున్న ఉమ్మడి జిల్లాల్లో నేడు విస్తీర్ణం పూర్తిగా తగ్గింది. కారణాలు అనేకం అయినప్పటికీ ఆరుగాలం కష్టపడి పనిచేసే రైతన్నలకు చివరకు తన కష్టం కూడా మిగలడం లేదు. ఏటేటా సాగు ఖర్చులు భారీగా పెరిగి రాబడి గగనంగా మారింది. ప్రకృతి విపత్తులు, తెగుళ్ల దాడితో పంటల దిగుబడి బాగా తగ్గిపోయింది.

- పెరిగిన ఖర్చులు
- తగ్గిన దిగుబడులు
- వేరుశనగ, పత్తి పంటల సాగు తగ్గింది
- పెరిగిన మొక్కజొన్న, మినుము, సజ్జల సాగు

దిగుబడి తగ్గిన పత్తిపంట



నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు వ్యవసాయం ఆర్థికభారంగా మారుతోంది. మార్కెట్ ధర ఉంటే పంట దిగుబడులు రాకపోవడం, దిగుబడులు బాగా వస్తే మార్కెట్ లేకపోవడం వంటి దోబూచులాటలో రైతన్న మగ్గిపోతున్నాడు. సాగు వ్యయంపై వ్యవసాయశాఖ అంచనాలకు రైతులు క్షేత్రస్థాయిలో పెడుతున్న ఖర్చులకు పొంతనే ఉండడం లేదు.



వేరుశనగ పంట

వేరుశనగపై మొగ్గు చూపలేదు

నంద్యాల జిల్లాలో వేరుశనగ పంటను 29,499 ఎకరాల్లో సాగుచేశారు. ఈ ఏడాది 18,113 ఎకరాలకు పరిమితమైంది. అధిక పెట్టుబడులు దానికి తోడు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు వేరుశనగ పంటపై మొగ్గు చూపలేదు. పత్తి పంటను ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా సాగు చేసేవారు. నంద్యాల జిల్లాలో 46,502 ఎకరాల లక్ష్యం కాగా నేటికి కేవలం 13,387ఎకరాల్లో మాత్రమే పత్తి పంటను సాగుచేశారు. అధిక తెగుళ్ల ప్రభావం పంట దిగుబడిపై చూపడంతో రైతులు పత్తి పంటపై ఆసక్తి చూపలేదు. ఆముదం పంట 7,214 ఎకరాల లక్ష్యం కాగా 4,683ఎకరాలకు పరిమితమైంది. నంద్యాలలో అత్యధికంగా పండించే కొర్ర పంట 4,542 ఎకరాల లక్ష్యం కాగా 2900 ఎకరాలు మాత్రమే వేశారు. పెసర 690 ఎకరాల లక్ష్యం కాగా 99 ఎకరాలు, జొన్న 2,153 ఎకరాల లక్ష్యం కాగా 257 ఎకరాలే మాత్రమే రైతులు వేశారు. పొద్దుతిరుగుడు పంట 961 ఎకరాలు లక్ష్యం కాగా 87 ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు.

అంచనాలకు మించి..

జిల్లాలో ఈఏడాది మొక్కజొన్న పంటపై రైతులు ఆసక్తి చూపారు. తక్కువ పెట్టుబడి, అధిక రాబడి ఉండడంతో వ్యవసాయాధికారుల అంచనాలకు మించి పంటను సాగుచేశారు. 1,33,750 ఎకరాల లక్ష్యం కాగా 1,54,010 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఈసారి ఆశ్చర్యకరంగా సజ్జలు, సోయాబీన్, మినుము పంటలపై రైతులు ఆసక్తి కనబరిచారు. వ్యవసాయాధికారుల లక్ష్యాల మేరకు సజ్జలు 9,143 ఎకరాలు కాగా 12,062 ఎకరాల్లో సాగుచేశారు. సోయాబీన్ 10,315 ఎకరాల లక్ష్యం కాగా 12,362 ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. మినుము 23,959 ఎకరాల లక్ష్యం కాగా 25,897 ఎకరాల్లో పంటను వేశారు.

పెరిగిన మొక్కజొన్న విస్తీర్ణం



మార్కెట్‌లో ధర ఉండటం లేదు



పంటలు బాగా పండినప్పుడు మార్కెట్లో ధర ఉండటం లేదు. అన్నీ బాగుంటే ప్రకృతి పగబడుతోంది. గత ఏడాది పండించిన పొగాకు పంట నేటికీ అమ్ముడుపోవడం లేదు. ఇతర పంటలు కూడా వేశాం. తీరా పంట చేతికొచ్చాక రైతు పరిస్థితి దయనీయంగా మారుతోంది. పత్తి పండించాలంటే ఎకరాకు లక్షకు పైగానే పెట్టుబడి వస్తోంది.

- నాగేశ్వరరెడ్డి, రైతు, పాములపాడు

రైతుల జీవితాలతో చెలగాటం



కల్తీ విత్తనాలతో రైతులు కుదేలవుతున్నారు. అదే సమయంలో పలు కంపెనీలు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. వేరుశనగ పంట సాగు భారీగా పడిపోవడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతారు.

- రాజశేఖర్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సాగు విస్తీర్ణం తగ్గిపోతూ..



ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా పండించే పంటల్లో వేరుశనగ, పత్తి పంటలు. ప్రతియేటా సాగువిస్తీర్ణం తగ్గిపోతూ వచ్చింది. కారణం పత్తికి గులాబీ రంగు పురుగు ఆశించడంతో రైతులు నష్టాల పాలయ్యారు. వేరుశనగకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు ఈ ఏడాది ఈపంటపై కూడా ఆసక్తి చూపలేదు.

- సుధాకర్, శాస్త్రవేత్త. కేవీకే, బనగానపల్లె

విధేయుడికి అందలం



- శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా రమేష్ నాయుడు
- ఆయన స్వస్థలం అన్నమయ్య జిల్లా రాజంపేట
- బీజేపీలో క్రియాశీలక నేతగా గుర్తింపు

6

కుండపోత వర్షం

- నేలంపాడు గ్రామం జలమయం
- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- వెయ్యి ఎకరాల్లో నీట మునిగిన పొలాలు
- ఇళ్లల్లోకి ప్రవేశించిన వరద నీళ్లు
- స్తంభించిన రాకపోకలు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు



నేలంపాడులో ప్రవహిస్తున్న వరద నీరు

నేలంపాడులో నీట మునిగిన పొలాలు



చాగలమర్రి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. 58 మి.మీ వర్షపాతం నమోదైంది. నేలంపాడు గ్రామం జలమయమైంది. రాంపల్లె నుంచి నేలంపాడు గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. జంగాలపల్లె, నేలంపాడు, గొట్లూరు, రాంపల్లె గ్రామాల సమీపంలోని పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మినుము, మొక్కజొన్న, కంది, వరి, జూట్ పంటలు దెబ్బతిన్నాయి. వరద భారీగా పొలాల్లో చేరడంతో రైతులకు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. గ్రామంలో వరద నీరు ప్రవహిస్తుంటంతో పాఠశాలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను వరద నీటిలోనే తీసుకెళ్లి వారి ఇళ్లకు క్షేమంగా చేర్చారు. గోపాయపల్లె రహదారిలో గల అడ్డవాగు పొంగి ప్రవహించింది. చాగలమర్రి నుంచి ప్రొద్దుటూరుకు రాకపోకలు స్తంభించాయి. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది 17వేల క్యూసెక్కులతో ప్రవహించింది. ముందస్తుగా ఆనకట్ట నుంచి కేసీ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని తగ్గించామని ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట వద్దగల ఐదు గేట్లను ఎత్తి కడప జిల్లా వైపునకు వరదను విడుదల చేశారు. ముత్యాలపాడు, శెట్టివీడు, బ్రాహ్మణపల్లె, మల్లేవేముల గ్రామాల సమీపంలో బెండ, మినుము, కంది, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వో ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు జనార్థన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించారు. వరద సహాయక చర్యలు చేపడుతామని, నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు.



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

నిండా ముంచేశారు..!



- కర్నూలు మార్కెట్‌లో నిబంధనలు బేఖాతరు
- హమాలీ పేరిట దగా చేస్తున్నారు
- హమాలీ ఖర్చులు భరిస్తున్న మార్క్‌ఫెడ్
- అయినా రైతుల నుంచి బలవంతపు వసూళ్లు
- బస్తాకు రూ.45 వరకు దోపిడీ
- చోద్యం చూస్తున్న మార్కెట్ యంత్రాంగం

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో ఏకైక ఉల్లి మార్కెట్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు. సీమ జిల్లాలలో పాటుగా సరిహద్దు తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా, కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాల నుంచి ఉల్లి దిగుబడులతో పాటు వేరుశనగ, వాము, ఆముదం.. వంటి పంట దిగుబడులు అమ్మకానికి తెస్తున్నారు. రైతులు తీసుకొచ్చే వివిధ పంట దిగుబడులు ప్లాట్‌ఫాంలో దింపడం, కోత కోసి కుప్ప పోయడం, ఆ తరువాత కాటా.. ఇలా హమాలీలు చేసే ఒక్కో పనికి ఒక్కోరేటు నిర్ణయించారు. అందులో మూడు రకాల హమాలీ ఖర్చులు రైతులు భరించాల్సి ఉంటుంది. పంట విక్రయం (ట్రేడింగ్) జరిగిన తరువాత కాటా, లోడింగ్ వంటి హమాలీ ఖర్చులు కొనుగోలుదారులే భరించాలి. అదికూడా మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధర కంటే ఒక్కపైసా కూడా అదనంగా తీసుకోకూడదు. నిబంధనలు తుంగలో తొక్కేసి మార్కెట్‌కు వచ్చే రైతుల కన్నీటిని సైతం దోచేస్తున్నారంటే దోపిడీ పర్వం ఏస్థాయిలో జరుగుతుందో తెలుసుకోవచ్చు.

ఏడాది ఉల్లి ధరలు పూర్తిగా పతనమయ్యాయి. క్వింటా రూ.350-500లకు కూడా పలకని పరిస్థితి ఉంది. దీనికితోడు అధిక వర్షాలకు పంట దెబ్బతిని దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. పంటకోత కూలీలు, రవాణాల ఖర్చులు కూడా చేతి నుంచే పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతులు ఉల్లి పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. ఇలాంటి సమయంలో అండగా మేమున్నామని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించింది. ఏపీ మార్కెఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ నిర్ణయం చితికిపోతున్న రైతుల్లో ఊపిరి పోసింది. నిబంధనల ప్రకారం రైతులు తీసుకొచ్చిన ఉల్లి బస్తాకు అన్ లోడింగ్ (దింపడం) రూ.5.04, కోసి కుప్ప పోయడానికి రూ.5.04, చాటా నింపుటకు రూ.5.04 కలిపి బస్తాకు రూ.15.12 రైతులు చెల్లించాలి. ఆ తరువాత ఖర్చులన్నీ కూడా కొనుగోలుదారులు (ట్రేడర్) భరించాలి. ఇందుకు విరుద్ధంగా హమాలీ పేరిట సాగుతున్న దోపిడీ వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఏకరువు పెడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు

శ్రీశైలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం మల్లన్న హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. చంద్రావతి కల్యాణ మండపంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.3,46,96,431 నగదు రాబడిగా లభించింది. ఈ కానుకలను భక్తులు గత 29 రోజుల్లో సమర్పించినట్లు ఆలయ డిప్యూటీ ఈవో ఆర్.రమణమ్మ వెల్లడించారు. నగదుతో పాటు 13.13 తులాల బంగారు, 5.5 కిలోల వెండి కూడా సమకూరింది. వీటితో పాటు యుఎస్ఏకు చెందిన 2321 డాలర్లు, మలేషియాకు చెందిన 57 రింగిట్స్, 20 కెనెడా డాలర్లు, 567 ఖతార్ రియాల్స్, 845 యుఏఈ దిర్హమ్స్, 15 ఆస్ట్రేలియా డాలర్లు, 30 ఈరోస్, 165 యూకే పౌండ్స్, 100 జాంబియా క్వాచాలు, 200 కాంగో ఫ్రాంక్‌లతో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీ హుండీలో లభించింది. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాకు 2,348 ఇళ్లు మంజూరు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాకు 2,348 ఇల్లు మంజూరైనట్లు జిల్లా హౌసింగ్ పీడీ హరగోపాల్ తెలిపారు. పట్టణంలోని హౌసింగ్ కార్యాలయంలో గురువారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అంగీకార్-2025 కరపత్రాలను ఆవిష్కరించారు. పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు పట్టణ ప్రాంతాల్లో 2024-25 సంవత్సరానికి గానూ 1892, 2025-26 సంవత్సరానికి గానూ 456 ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఆళ్లగడ్డకు 83 ఇళ్లు, నంద్యాలకు 650, నందికొట్కూరుకు 411, శ్రీశైలం, ఆత్మకూరు పట్టణాలకు కలిపి 272, డోన్‌కు 362, బేతంచెర్లకు 570 ఇల్లు ప్రాంతాల వారిగా మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'స్కానింగ్ టోకెన్ల కోసం పడిగాపులు' అన్న ఆంధ్రజ్యోతి కథనానికి కర్నూలు జీజీహెచ్ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ లోని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సీఎస్ఆర్ఎంవో డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణ, డయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ శివబాల స్కానింగ్ కోసం వచ్చిన రోగులకు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్ రేడియాలజి విభాగపు వైద్యులతో సమావేశం నిర్వహించారు. స్కానింగ్‌కు వచ్చే రోగులకు త్వరితగతిన పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజు 450 అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహిస్తారని, న్యూడ యోగ్నస్టిక్ బ్లాక్‌లో బుధవారం ఉదయం 164 మందికి, మధ్యాహ్నం 108మంది పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇక నుంచి రోగులకు అవసరమైతేనే అల్ట్రాసౌండ్ పరీక్షలు రాయాలని సంబంధిత విభాగాల ప్రొఫెసర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కవి సమ్మేళనాలు దోహదం

● అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వీసీ పీఎస్ షావళి ఖాన్



కవి సమ్మేళనంలో పాల్గొన్న ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షావళి ఖాన్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషాభివృద్ధికి కవి సమ్మేళనాలు దోహదపడుతాయని అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ వీసీ పీఎస్ షావళి ఖాన్ అన్నారు. గురువారం యూనివర్సిటీలో ఈద్-ఏ-మిలాదున్-నబీ సందర్భంగా ఒక్క రోజు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సమాజ శ్రేయస్సు కోసం నేర్పిన సూత్రాలను పాటిస్తూ ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. ఆన్ లైన్ ద్వారా ముఖ్యఅతిథిగా ఎన్ సీపీయూఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ షంసు ఇక్బాల్ మాట్లాడారు. ఉర్దూ భాషా వాడుక భాషలో ఒక మాధ్యమంగా పని చేస్తుందన్నారు. లతీఫ్ షా లౌబాలి దర్గా పీఠాధిపతులు సయ్యద్ షా అబ్దుల్లా హుస్సేనీ బాద్షా ఖాద్రీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త శాంతి కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ లోక్‌నాథ్, కవులు అబ్దుల్ జిలానీ, అతవుల్లాహ్ ఖాద్రీ, ఖాద్రీ రసూల్, యూనిస్ బోఖారీ, జీబా ఫాతీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా, కన్వీనర్ ఎస్ఎస్ఎం హుస్సేనీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు మహానందిలో ఏర్పాట్లు



మహానందిలో ప్రత్యేక యాగశాల నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

మహానంది, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో 11 రోజుల పాటు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు గురువారం నుంచి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే కామేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను దాతల సహకారంతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రత్యేక విద్యుత్ అలంకరణ పనులతో పాటు చండీ హోమాలు నిర్వహించేందుకు గాను ఆలయ రెండో ప్రాకారం ఆవరణలో యాగశాలలను నిర్మిస్తున్నారు. అలాగే నంద్యాలకు చెందిన గురు రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత షేక్షావలి రెడ్డి, సింధూ దంపతులు రూ.50 వేలతో కలశ స్థాపన పీఠాలతో పాటు యాగశాలకు ఫ్యాన్లు, విద్యుత్‌దీపాలను అందజేస్తారని ఆలయ అధికారులు వెల్లడించారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సినీ ప్రముఖులు



మంత్రాలయంలో సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, ఎంఎం కీరవాణి

మంత్రాలయం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ దర్శకులు ఎస్.ఎస్.రాజమౌళి తండ్రి, సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణి, ఎం.ఎం.కళ్యాణ్ మాలిక్ కుటుంబ సమేతంగా గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహా ముఖద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతిఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘన స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

పులకించిన ప్రకృతి



హరివిల్లు, చిరుజల్లు, చుక్కలు, ఆకాశం... ఇలా అన్నీ అందరి కోసం అంటూ ఓ సినీ కవి వర్ణిస్తే.. ఆకాశంలో అందమైన రంగుల చాపం ఇంద్ర ధనుస్సు కూడా వర్ణించలేని మరో అందమే. ఉయ్యాలవాడ మండలంలో గురువారం సాయంత్రం సప్తవర్ణాలు ఏకమై ఆకాశంలో అర్ధవృత్తాకారంలో ఏర్పడిన ఇంద్రధనుస్సు చూపరులను ఆకట్టుకుంది. ఆ హరివిల్లు అందాలకు ప్రకృతి సైతం పులకించింది. సాయం సంధ్యవేళ ఏర్పడిన ఈ ఇంద్ర ధనుస్సును కూలీలు, ప్రజలు ప్రత్యేకంగా వీక్షించారు.

● ఉయ్యాలవాడ, ఆంధ్రజ్యోతి

నిన్న ఆనందం.. నేడు నైరాశ్యం..!

● నియామక పత్రాల అందజేత వాయిదా

● భారీ వర్షాల నేపథ్యంలో రద్దు చేశామన్న అధికారులు

● కర్నూలు నుంచి వెనుదిరిగిన అభ్యర్థులు, బంధువులు



రాయలసీమ యూనివర్సిటీలో డీఎస్సీ-25 ఎంపికైన అభ్యర్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మరి కొన్ని గంటల్లో తమకు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుతాయని వారు ఆనందం పడ్డారు. బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలుకు చేరుకున్నారు. అంతలోనే వారికి ఓ చేదువార్తను అధికారులు చెప్పారు. దీంతో వారంతా నిరాశకు గురయ్యారు. విజయవాడలో జరిగే ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని గురువారం చివరి నిమిషాల్లో అర్థాంతరంగా వాయిదా వేశారు. ఎప్పుడు ఉంటుందో జిల్లా విద్యా శాఖాధికారుల ద్వారా తెలియజేస్తామని జాయింట్ కలెక్టర్ చెప్పారు. విజయవాడలో భారీ వర్షాలు కురుస్తుండడంతో అభ్యర్థులతో పాటు, బంధువులు వసతి సౌకర్యాలు ఏర్పాటులో ఇబ్బందులు ఉంటాయని భావించిన రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రాత్రంతా ప్రయాణించి.. అలసిపోయి..

ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నాన్‌లోకల్ అభ్యర్థులు, బంధువులు శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, గుంటూరు, నల్గొండ, మెదక్ ప్రాంతాల నుంచి రాత్రంతా ప్రయాణించి కర్నూలుకు చేరుకున్నారు. గురువారం ఉదయం అంతా రాయలసీమ యూనివర్సిటీకి చేరుకోవడంతో ఆ ప్రాంతం జన జాతరగా మారింది. అభ్యర్థులు, బంధువులు, అధికారులు కలిపి దాదాపు 8వేల మంది దాకా వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 134 ఆర్టీసీ బస్సులతో యూనివర్సిటీ ఆవరణం కిక్కిరిసింది. వచ్చిన వారందరికీ ఆల్పాహారం, తాగునీటిని సరఫరా చేశారు. మరి కొన్ని గంటల్లో ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంటామని భావించిన అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. కార్యక్రమం వాయిదా పడింది. ఇక్కడికి చేరుకున్న వారందరూ ఇబ్బందులు పడకుండా నియోజవర్గాలవారీగా ఆయా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించి స్వస్థలాలకు పంపారు. ఎవరి ప్రాంతాలకు వారు వెనుదిరిగి వెళ్లారు.



ప్రయాణం రద్దు అయినట్లు ప్రకటిస్తున్న జేసీ నవ్య



ఆర్టీసీ బస్సులో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులు

నిండా ముంచేశారు..!

5వ పేజీ తరువాయి

ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ.1,200 ప్రకారం 6,057 మెట్రిక్ టన్నులు (60,570 క్వింటాళ్లు) కొనుగోలు చేసింది. 1,21,140 బస్తాలు ఉల్లి దిగుబడులు రైతుల నుంచి సేకరించారు. మార్కెట్ నిబంధనలు ప్రకారం కొనుగోలు తరువాత కాటా, సంచుల్లోకి నింపడం, సంచులు కుట్టేందుకు పురికోస (చిన్నపాటి తాడు), లోడింగ్ ఖర్చులు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థనే భరించాలి. వీటి కోసం బస్తాకు రూ.18 చెల్లిస్తున్నామని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు రాజు తెలిపారు. ఇందుకు విరుద్ధంగా కాటా, సంచులకు నింపడం, పురికొస కొనుగోలు చేయడం వంటి హమాలీ ఖర్చుల రూపంలో ముక్కుపిండి వసులు చేస్తున్నారని, బస్తాకు రూ.40-45 వరకు భరించామని, పురికోస కిలో రూ.150కు కొనుగోలు చేసి హమాలీలకు ఇచ్చామని ఉల్లి రైతులు ఏకరువు పెడుతున్నారు. ఈ లెక్కన సుమారుగా రూ.55 లక్షల వరకు రైతుల నుంచి అక్రమంగా వసులు చేసినట్లు ఆరోపణలు బలంగా ఉన్నాయి. హమాలీలు వసులు చేశారా? ఆ పేరిట కమిషన్ ఏజెంట్లు వసులు చేశారా? మార్కెట్ సూపర్‌వైజర్లు, కమిషన్ ఏజెంట్లు కుమ్మక్కై హమాలీ ఖర్చుల పేరిట దోపిడీ చేశారా? అన్నది అధికారులే చెప్పాలి. ఏపీ మార్క్‌ఫెడ్, లైసెన్సుడ్ వ్యాపారులు ఉల్లి సేకరించిన రైతుల జాబితా మార్కెట్ అధికారుల వద్ద ఉంటుంది. ఏసీబీ లేదా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేయిస్తే దోపిడీ బాగోతం వెలుగు చూస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



బస్తాకు రూ.18 చెల్లిస్తున్నాం

కర్నూలు మార్కెట్ యార్డులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,200 ప్రకారం 6,057 మెట్రిక్ టన్నులు సేకరించాం. కొనుగోలు చేసిన తరువాత కాటా, సంచులకు నింపడం, లోడింగ్.. వంటి హమాలీ ఖర్చులు బస్తాకు రూ.18 ఏపీ మార్క్‌ఫెడ్ చెల్లిస్తుంది. ఈ లెక్కన రూ.21.80 లక్షలు భరిస్తున్నాం. రైతులు ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పురికోస కూడా మేమే కొనుగోలు చేశాం. రైతుల నుంచి అక్రమంగా వసూలు చేయడంపై మార్కెట్ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తాను.

● రాజు, ఏపీ మార్క్‌ఫెడ్, జిల్లా మేనేజరు, కర్నూలు

అక్రమ వసూళ్లపై విచారణ చేయిస్తా



రైతులు పంట దిగుబడులు మార్కెట్‌కు తెస్తే, కొనుగోలుకు ముందు, కొనుగోలుకు తరువాత రెండు రకాల హమాలీ ఖర్చులు ఉంటాయి. పంట మార్కెట్‌కు తెచ్చాక సంచులు దింపడం (అన్‌లోడింగ్), కోసి కుప్ప వేయడం, చాటా నింపుట.. ఈ మూడింటికి బస్తాకు రూ.15.12లు రైతులే భరించాలి. కొనుగోలు (ట్రేడింగ్) జరిగిన తరువాత కాటా, సంచులకు నింపడం, సంచులు కుట్టడం, పురికోస కొనుగోలు, లోడింగ్.. వంటి హమాలీ ఖర్చులు బస్తాకు దాదాపు రూ.18లు కొనుగోలుదారులే భరించాలి. రైతుల ఉంచి ఒక్కపైసా కూడా వసులు చేయరాదు. అక్రమంగా వసులు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. రైతులు, వ్యాపారులతో మాట్లాడడమే కాకుండా దీనిపై విచారణ చేయించి నిజమని తేలితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాను.

● జయలక్ష్మి, స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ, మార్కెట్ యార్డు, కర్నూలు

ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా బీటీ నాయుడు

● శాసన మండలిలో బాధ్యతల స్వీకరణ



శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు సమక్షంలో ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీటీ నాయుడు, చిత్రంలో కమిటీ సభ్యులు ఉన్నారు.

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో కీలకమైన ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు బీటీ నాయుడుతో ప్రమాణం చేయించారు. కర్నూలు జిల్లాలో టీడీపీ కీలక నాయకుడిగా ఎదుగుతూ రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆయనకు ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. సభా, సభ్యుల హక్కుల రక్షణలో ఈ కమిటీ ప్రత్యేకంగా పని చేస్తుంది. అదే క్రమంలో సభ్యులు సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవడంతో పాటు సమస్య తీవ్రంగా ఉంటే సస్పెండ్ చేసే అవకాశం కూడా ఈ కమిటీకి ఉంటుంది. చైర్మన్ బీటీ నాయుడుతో పాటు కమిటీ సభ్యులు జయేంద్రభరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పి. రవీంద్రబాబు, రాఘురాం, రాజగోళ్ల రమేశ్‌యాదవ్‌లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తనపై ఎంతో నమ్మకంతో ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ పదవికి ఎంపిక చేశారన్నారు. వెనుకబడిన కోసిగి ప్రాంతానికి చెందిన తనకు ఈ పదవి రావడం జీవితంలో కీలక ఘట్టమన్నారు. ప్రస్తుతం సభా హక్కులు, సభ్యుల హక్కులు ఉల్లంఘనలపై 37 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని విచారించి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సభా, సభ్యుల హక్కులకు రక్షణగా ఉంటానని తెలిపారు.

విధేయుడికి అందలం

● శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా పోతుగుంట రమేష్ నాయుడు

● ఆయన స్వస్థలం అన్నమయ్య జిల్లా రాజంపేట

● బీజేపీలో క్రియాశీలక నేతగా గుర్తింపు



ప్రధాని నరేంద్ర మోదీతో రమేష్ నాయుడు (ఫైల్)

నంద్యాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, విధేయుడిగా పోతుగుంట రమేష్ నాయుడును పార్టీ గుర్తించింది. సామాన్య కార్యకర్తగా ఎదిగిన ఆయన్ను శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున ఆలయ పాలక మండలి చైర్మన్‌గా ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా రాజంపేట మండ లం కూచివారిపల్లి పంచాయతీ వైబీఎన్ గ్రామానికి చెందిన పోతుగుంట రమేష్ నాయుడు ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో పనిచేసి గుర్తింపు పొందారు. తర్వాత బీజేపీలో ఉంటూ పలు పదవులను చేపట్టారు. 2019 ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి అబ్జర్వర్‌గా అదనపు బాధ్యతలు చూసుకుంటున్నారు. బీజేపీలో అంచలంచెలుగా ఎదిగిన ఆయనకు రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు(రాజంపేట) కీలక నాయకులతో సాన్నిహిత్యం ఉంది. 30 ఏళ్లుగా బీజేపీలో వివిధ హోదాల్లో ఆయన పనిచేసి గుర్తింపు పొందారు. దీంతో విధేయతను గుర్తించిన బీజేపీ శ్రీశైలం పాలకమండలి అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. పాలకమండలి చైర్మన్‌గా ఎంపికైన రమేష్ నాయుడుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

పార్టీ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు

శ్రీశైల ఆలయ పాలకమండలి చైర్మన్‌గా అవకాశం కల్పించిన బీజేపీ పెద్దలకు, సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు. నాపై నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించారు. ఆలయ అభివృద్ధికి, క్షేత్ర గుర్తింపునకు కృషి చేస్తాను.

● పోతుగుంట రమేష్ నాయుడు

దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

శ్రీశైలం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాలకు రావాలని ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుకు ఆహ్వానం పలికారు. న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, అర్చకులు గురువారం ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ముఖ్యమంత్రికి శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అలాగే దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డికి పత్రికను అందజేసి ఆహ్వానించారు.



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, ఈవో

పత్తి పంటలో గంజాయి సాగు

కర్నూలు జిల్లా ఆదోనిలో సంఘటన



పత్తి పంటతో పాటు సాగు అవుతున్న గంజాయి మొక్కలు

ఆదోని రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి సాగు, రవాణా పూర్తిగా నిషేధం. కానీ ఆదోని మండలంలో ఓ వ్యక్తి పత్తిపంటలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడు. ఆదోని మండలం కుప్పగల్లు గ్రామంలో దివ్యాంగుడు వెంకటేశ్ తనకున్న 3.5 ఎకరాల పొలంలో పత్తి పంటను సాగు చేస్తున్నాడు. అయితే గ్రామస్థుల ద్వారా సమాచారం తెలుసుకున్న పెద్ద తుంబళం పోలీసులు గురువారం పత్తిపంటను పరిశీలించారు. అక్కడ పత్తిమొక్కల మాటున 9 గంజాయి మొక్కలను పోలీసులు గుర్తించారు. వెంటనే ఆ గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. సదరు రైతు వెంకటేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై ఆదోని రూరల్ సీఐ నల్లప్పను వివరణ కోరగా కుప్పగల్‌కు చెందిన వెంకటేష్ తన మూడున్నర ఎకరాల పొలంలో పత్తి పంటతో పాటు గంజాయిని సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

ఇన్‌చార్జిలే దిక్కు..

- 11 నెలలైనా భర్తీ కాని జిల్లా రిజిస్ట్రార్ పోస్టు
- పేరుకుపోయిన ఫైళ్లు
- ముందుకు సాగని పాలన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కల్లూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. జిల్లా రిజిస్ట్రార్‌ను నియమించడంలో ఉన్నతాధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దాదాపు 11 నెలలుగా కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఫైల్స్ పేరుకుపోయి పాలన ముందుకు సాగడం లేదు. ఇన్‌చార్జిలతో కాలం వెల్లదీస్తున్నారు. రెగ్యులర్ రిజిస్ట్రార్ నియమించడంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఫేషీలో ఫైళ్లు ముందుకు కదలక, సమస్యలకు పరిష్కారం దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల అలసత్వం..

కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ ఫేషీలో ఫైళ్లు పేరుకుపోతున్నాయని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ డీఆర్ లేకపోవడంతో ఇన్‌చార్జిలకు బాధ్యత అప్పగించారు. ఈ తలనొప్పులు మాకెందుకులే అని ఇన్‌చార్జ్ డీఆర్‌గా పనిచేస్తున్న అధికారులు ప్రజలు, వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దాదాపు 11 నెలలుగా డీఐజీతో కలిసి నలుగురు అధికారులు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసినా ఏఒక్క పని జరగలేదని ప్రజలు వాపోతున్నారు. సొసైటీ నూతన దరఖాస్తులు, అనుమతులు, చిట్‌ఫండ్ కొత్త దరఖాస్తులు, రెన్యూవల్ నిలిచిపోయాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎడిట్ ఇన్‌డెక్స్ (ఈసీల్లో తప్పుల సవరణ జిల్లా వ్యాప్తంగా)జరగడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో జరిగే అవకతవకలు, తప్పుడు, ఫేక్ రిజిస్ట్రేషన్లపై ప్రజలు ఇచ్చే పిర్యాదులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కర్నూలు జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, ఐజీ అధికారులు కూడా రెగ్యులర్ డీఆర్‌ను నియమించడంలో విఫలం అయ్యారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

ఇంకెన్నాళ్లు ఇలా..

2024 సెప్టెంబరు 22న కర్నూలు జిల్లాకు సీహెచ్.నాగమల్లీశ్వరరావు డీఆర్‌గా విధుల్లో చేరారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో ఆయన విశాఖపట్నం డీఆర్‌గా వెళ్లారు. కొంతకాలం డీఐజీ కళ్యాణి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. తర్వాత చెన్నకేశవరెడ్డికి ఇన్‌చార్జ్ డీఆర్‌గా అప్పగించారు. తాత్కా లికంగా సేవలందించి సెలవుపై వెళ్లారు. ఆతర్వాత అనంతపురం జిల్లా డీఆర్ భార్గవ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వగా అరకొరగా పనిచేస్తూ అటువైపు రాలేదని ప్రజలు ఆందోళన చెందారు. ఆయన స్థానంలో నంద్యాల డీఆర్ జానకీదేవిని కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ ఇవ్వగా అడపాదడపా ప్రజలకు దర్శనమిచ్చారు. మళ్లీ ఆమె స్థానంలో అనంతపురం జిల్లా డీఆర్ భార్గవ్‌ను కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ ఇవ్వడంతో ప్రజలే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వినియోగదారుల పట్ల స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు చిత్తశుద్ధి లేదని రెగ్యులర్ రిజిస్ట్రార్‌ను నియమించడంతో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజలు, క్రయ విక్రయదారులు సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కర్నూలుకు రెగ్యూలర్ జిల్లా రిజిస్ట్రార్‌ను నియమించాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



తెరుచుకోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ తలుపు

వెలుగులో చీకట్లు

- అవినీతికి తెరలేపిన బుక్ కీపర్లు
- మోసపోతున్న సామాన్యులు
- విచారణ చేపట్టిన అధికారులు



దేవనకొండలోని స్రీ శక్తి భవనం

దేవనకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థికంగా చేయూతను అందించే వెలుగు పథకంలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. ప్రభుత్వం పది మంది సభ్యులతో పొదుపు సంఘాలుగా ఏర్పాటుచేసింది. నెలనెల పొదుపుతో పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, రూపాయి వడ్డీ రుణాలిస్తోంది. వెలుగు కార్యాలయంలో పనిచేసే కొంత మంది ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. అవినీతికి తెర లేపారు. మండలం లో 44 గ్రామాలకు 1519 పొదుపు సంఘాలు 56 మంది బుక్ కీపర్లు ఉన్నాయి. పేదల బతుకుల్లో వెలుగులు నింపేలా స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాలతో జీవనోపాధి ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో బుక్‌కీపర్లు కొందరు నిధులు పక్కదారి పట్టించి సామాన్యులను అందినకాడికి దోచుకుంటున్నారు.

చాలాచోట్ల బ్యాంకు లింకేజీ రుణాల కంతులలో తేడాలు ఉండటంతో సభ్యులు అదనపు కంతులు సైతం కట్టాల్సి వస్తుంది. మండలంలోని పి.కోటకొండలో స్త్రీనిధి కంతులను బ్యాంకులో ఆటో డెబిట్ పెట్టినా కూడా బుక్‌కీపర్ సభ్యుల నుంచి నగదు వసూలు చేసి తన అవసరాలకు వాడుకున్నాడు. తీరా సభ్యులు గుర్తించాక పొరపాటు జరిగిందంటూ కప్పిపుచ్చిన ప్రయత్నంచేశాడు. అధికారులు సైతం అవినీతిపై విచారణకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ ఏడాది స్త్రీనిధి లక్ష్యం రూ.7 కోట్లు గాను, ఇప్పటికి రూ.80లక్షలు మాత్రామే లబ్ధిదారులకు అందాయి. స్త్రీనిధి, ఉన్నతి నిధులు అసలైన పేదలకు అందని ద్రాక్షగానే మిగిలాయి.

నిధులు అందేలా చర్యలు తీసుకుంటాం



కోటకొండలో ఎనిమిది సంఘాల ఫిర్యాదుతో ఐదు సంఘాలను విచారించాం. మిగిలిన మూడు సంఘాలను త్వరలోనే విచారణ చేసి జిల్లా అధికారుల దృష్టికి తీసు కెళ్తాం. అవినీతి తావులేకుండా సభ్యులకు నిధులు అందేలా చర్యలు తీసుకుంటాం - **మాదుల లక్ష్మమ్మ, ఏపీఎం**

ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్

- లారీ డ్రైవర్లను బెదిరించి దోచుకోవడమే లక్ష్యం



అరెస్టు చూపుతున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

ఆలూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి లారీ డ్రైవర్లను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను ఆలూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఈనెల 5వ తేదీన అర్ధరాత్రి పట్టణంలోని అతిథి హోటల్ వద్ద జాతీయ రహదారిపై లారీని ఆపుకుని నిద్రిస్తున్న డ్రైవర్ నుంచి మొబైల్, డబ్బులు లాక్కోవడానికి ప్రయత్నించగా డ్రైవర్ ప్రతిఘటించడంతో చాకుతో దాడిచేసి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోపిడీ కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాల మేరకు సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు చేశారు. కర్నాటకలోని చిక్కవద్దట్టి గ్రామం, గదగ్ జిల్లాకు చెందిన షికారి ప్రేమేష్, బళ్లారి జిల్లా బసరకోడూరు గ్రామానికి చెందిన మూర్తి అనే ఇద్దరూ జల్సాలకు అలవాటు పడ్డారు. ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో డబ్బు, సెల్‌ఫోన్‌లు దొంగతనాలు చేస్తూ రాత్రిపూట రోడ్డు పక్కన నిద్రించే లారీ డ్రైవర్లను టార్గెట్ చేస్తూ కత్తులు, రాళ్లతో దాడి చేసి దోచుకునేవారు. గతంలో కూడా పలు కేసులు కూడా నమోదయ్యాయి. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో ప్రధాన ముద్దాయిలుగా ఉన్నారన్నారు. ఆదోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి మూడు చోరీ కేసుల్లో కూడా వీరు ముద్దాయిగా విచారణలో తేలిందన్నారు. కడప, ఆదోని సెంట్రల్ జైలులో శిక్ష కూడా అనుభవించారని తెలిపారు. ఈ కేసును చేధించిన ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా, ఏఎస్ఐ చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రంగయ్య, కానిస్టేబుల్ కె.పరశురాం, సుధాకర్, వీరాంజి, రమేష్‌ను సీఐ అభినందించారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన సామగ్రి • రూ.5లక్షలు నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవయ్యనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్టోరు రూంలో నిల్వ ఉంచిన వివిధ రకాల మందులు, ఫర్నిచర్, సామగ్రి దగ్ధమైనట్లు మెడికల్ ఆఫీసర్ శారద తెలిపారు. వివరాలు.. అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం సాయంత్రం 4గంటల సమయంలో స్టోర్ రూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆసమయంలో బయట హాలులో ఓ నర్స్ తప్ప ఎవరూ కార్యాలయంలో లేరు. సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా అదుపు కాలేదు. విద్యుత్ సి బ్బందికి సమాచారమిచ్చి కరెంట్ సప్లై నిలిపివేశాం. అగ్ని మాపక దళానికి సమాచారమివ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే దాదాపు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. వైద్య సిబ్బంది హాలులో ఉండటంతో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి వచ్చి ఘటనాస్థలికి చేరుకొని తగులు సూచనలు చేసి మునిసిపల్ సిబ్బందికి కాలిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు.

విద్యుత్‌శాఖపై ప్రజల్లో సంతృప్తి పెరగాలి

- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు దిశానిర్దేశం



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

కల్లూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖపై ప్రజలు, వినియోగదారుల్లో సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులను ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశించారు. గురువారం దూపాడులోని ఓప్రైవేట్ కళాశాలలో ఎస్ఈ ఎం.ఉమాపతి ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా, పల్లెలు, పట్టణాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా మెరుగైన విద్యుత్ ను సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. పని చేస్తున్న చోట అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా? అన్న అంశాలపై ప్రభుత్వం సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితబావంతో పనిచేయాలని, లైన్‌మెన్ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు 24 గంటలు అంతరాయం లేని విద్యుత్తును అందించి ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలని సీఎండీ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేట్ ఆఫీస్ డైరెక్టర్ టెక్నికల్ గురువయ్య, ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగంపల్లి సొసైటీ సీఈవోపై కేసు నమోదు

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపల్లి సహకార సొసైటీ సీఈవో కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. గురువారం ఎస్ఐ తెలిపిన వివరాలివీ.. కోటేశ్వరరావు నాగంపల్లి సొసైటీ సీఈవోగా 2022 నుంచి విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను రూ.42,40,160 వసూలు చేసుకుని సొసైటీలో జమ చేయకుండా తన సొంత అవసరాలకు వాడుకున్నట్లు చెప్పారు. రైతులకు కూడా తప్పుడు రసీదులు ఇచ్చి మోసం చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటిపై ఈ ఏడాది జూన్‌లో సొసైటీ ఉన్నతాధికారులు కోటేశ్వరరావుపై అంతర్గత విచారణ చేపట్టగా.. సొసైటీకి మోసం చేసినట్లు గుర్తించి సస్పెండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సొసైటీని మోసం చేసినట్లు గుర్తించి నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈవో కోటేశ్వరరావుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలని శక్తినగర్‌లో చోటుచేసుకున్నట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. శక్తినగర్‌కు చెందిన శ్రీరాములు, శంకుతల దంపతుల కుమారుడు మధు(21). అతడి తండ్రి ఆటో నడుపుతున్నాడు. తల్లి మార్కెట్లో కూరగాయల వ్యాపారం చేస్తుంది. మధు వాటర్ క్యాన్లు సప్లై చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజుల నుంచి అతడు మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. బుధవారం తల్లిదండ్రులు ఇరువురు ఎవరి పనిమీద వారు వెళ్లారు. రాత్రి 8గంటల సమయంలో మధు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు వచ్చి చూసి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య.. 9 మందిపై కేసు

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగు గ్రామంలో బోయ వెంకటేశ్వర్లు (40) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. వివరాలివీ.. గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన సామేలు అనే వ్యక్తిని గొర్రె దొంగలించాడన్న నెపంతో తీవ్రంగా కొట్టాడు. ఈ విషయంపై ఇదే గ్రామానికి చెందిన జెల్లి చిన్న లింగస్వామి, జెల్లి ఆంజనేయులుతో పాటు మరో ఏడుగురి కలిసి సామేల్‌ని ఎలా కొడుతావని చెప్పి వెంకటేశ్వర్లును బెదిరించారు. మనస్తాపానికి గురైన వెంకటేశ్వర్లు గురువారం తెల్లవారుజామున గొర్రెల వ్యాధులకు ఉపయోగించే మందు తాగడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వెంకటేశ్వర్లును ఆత్మకూరులోని వైద్యశాలకు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు భార్య వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చాగలమర్రిలో డిగ్రీ విద్యార్థిని కిడ్నాప్!

- ఆరా తీస్తున్న సీఐ, ఎస్ఐలు

చాగలమర్రి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పెద్దమకానం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని గురువారం కిడ్నాప్ చేసిన సంఘటన కలకలం రేపింది. కడప జిల్లా కానగూడురుకు చెందిన విద్యార్థిని చాగలమర్రి డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. స్వగ్రామం కానగూడురు నుంచి ఉదయం కళాశాలకు వచ్చి ఇంటికి వెళ్లాలని ప్రిన్సిపాల్ అనుమతి తీసుకొని మధ్యాహ్నా బయటకు వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి తీసుకొని వెళ్లారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐలు సురేష్, వరప్రసాద్, రామిరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ఆరా తీస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల కారును, ఆ వ్యక్తులను పట్టుకునేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టారు.

నంద్యాలలో చోరీ

- సూపర్ మార్కెట్‌లో రూ.30 వేలు, జనరల్ స్టోర్‌లో రూ.15 వేలు అపహరణ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టూటౌన్ పరిధిలో శ్రీరామ థియేట్ ఎదురుగా ఉన్న అంజనా సూపర్ మార్కెట్‌లో, అలాగే విశ్వనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర జనరల్ స్టోర్‌లో బుధవారం రాత్రి దొంగతనాలు జరిగాయి. టూటౌన్ సీఐ అస్రర్‌బాషా తెలిపిన వివరాలివీ.. అంజనా సూపర్ మార్కెట్‌లో గుర్తు తెలియని దుండగులు షెట్టర్ పగలగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఉదయం పేపర్ బాయ్స్ సమాచారంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారుగా రూ.30 వేలు నగదు పోయినట్లు బాధితులు తెలిపారు. అలాగే జనరల్ స్టోర్‌లో రూ.15 వేలు నగదు ఎత్తికెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దారి దోపిడీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతునగరం వద్ద మూడు రోజుల క్రితం దారి దోపిడీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన ఒక యువకుడు ఈనెల 15న రాత్రి డాబాలో భోజనం చేసి వెళ్తున్న సమయంలో పక్కకు ఆగి ఉన్నాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బెదిరించి 1.5 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో - బొలేరో ఢీ

- ఒకరి మృతి - ఆరుగురికి తీవ్ర గాయాలు

అవుకు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత చెర్లోపల్లె మెట్ట సమీపంలోని మలుపు వద్ద ప్రయాణికులతో వెళుతున్న ఆటోను బొలేరో వాహనం ఢీకొట్టడంతో నులక రాముడు (63) మృతి చెందాడు. ఆనంద్‌శర్మ, లక్ష్మీదేవి, పుల్లమ్మ, డ్రైవర్ లతీఫ్ తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఉదయం రామాపురం, చెర్లోపల్లె గ్రామాలకు చెందిన ఏడుగురు ఉదయం 8-45 గంటల సమయంలో ఆటోలో అవుకుకు బయలు దేరారు. ఆటో పాత చెర్లోపల్లె మెట్ట సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న ట్యాలీ బొలేరో వాహనం ఆటోను ఢీకొట్టింది. నులక రాముడు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడ్డ వారిని 108 ద్వారా అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రాజారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం

- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య గురువారం ఉదయం వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వాట్సాప్ గ్రూపులో బుధవారం రాత్రి ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టడంతో వివాదం తలెత్తింది. దీంతో గురువారం ఉదయం తమ ఉపాధ్యాయ సంఘం నాయకుడితో సదరు ఉపాధ్యాయుడు పక్కనే ఉన్న పాఠశాలకు వచ్చారు. అర్థరాత్రి వేళ అసభ్యకరమైన వ్యాఖ్యలు పోస్టు చేసి కించపరిచే విధంగా మాట్లాడడమేమిటని ప్రశ్నించారు. ఇరువురి మధ్య మాట మాటా పెరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకునే వరకు వచ్చింది. పక్కనే ఉన్న ఉపాధ్యాయులు ఇరువురికి సర్ది చెప్పి పంపారు. మునిసిపల్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధాకర్‌కు ఉపాధ్యాయ సంఘ నాయకుడు గతంలోనూ ఇలాగే విమర్శలు చేశారని మళ్లీ బుధవారం రాత్రిక కూడా అలాగే ప్రవర్తించారని చర్యలు తీసుకోవాలంటూ రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సదరు ఇన్‌చార్జి హెచ్‌ఎం దీనిపై వచ్చాక మాట్లాడదామని డిప్యూటీ ఈవో, ఎంఈవో దృష్టి కూడా తీసుకెళ్తానని తెలిపారు. అయితే చర్యలు తీసుకోకపోవడంతో రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదుచేశారు. సీఐ రాజశేఖర్ రెడ్డి ఎంఈవో-2 శ్రీనివాసులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయుడిని స్టేషన్‌కి పిలిపించి విచారించారు. రాత్రి వాట్సప్ గ్రూప్‌లో అసభ్యకరంగా మాట్లాడారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై డిప్యూటీ డీఈవో వెంకటరమణతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి విచారిస్తామని సీఐకి తెలపడంతో రాతపూర్వకంగా రాసిచ్చి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు. సీఐ రాజశేఖర్ రెడ్డిని వివరణ కోరగా డిప్యూటీ ఈవోతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అక్కడితో గొడవ సద్దుమణిగింది.

బాల కార్మికుల అక్రమ రవాణా ముఠా అరెస్టు

నంద్యాల టౌన్ సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను అక్రమంగా తీసుకెళ్తున్న ఒడిశాకు చెందిన ఏజెన్సీ వారిని నంద్యాల జీఆర్‌పీ పోలీసులు, ఏహెచ్‌టీయూ సంస్థ వారు గురువారం రాత్రి పట్టుకున్నారు. జీఆర్‌పీ ఎస్ఐ కుమారి తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన కొన్ని ఏజెన్సీల వారు బాల కార్మికులను అక్రమంగా పలు ప్రాంతాల్లో పని చే యడానికి తీసుకెళ్తుండగా ఏహెచ్‌టీయూ, బీపీఏ, నీడ్స్ సంస్థ ఆర్‌పీఎఫ్ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా రైళ్లల్లో తనిఖీలు చేయగా అనుమాస్పదంగా కనిపించడంతో విచారించగా విషయం బయట పడినట్లు తెలిపారు. 9 మంది బాలకార్మికులను బరంపుర వద్ద ఎక్కించుకుని పలు ప్రాంతాల్లో బెంగళూరు, ఇంకా పలు ప్రాంతాల్లో పెయింటింగ్, టైల్స్ వేయడానికి, హోటళ్లల్లో పని చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఐదుగురిపై కేసు నమోదు చేసి మైనర్లను వారి సొంత గ్రామాలకు పంపిస్తామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డీసీపీవో స్వప్న ప్రియదర్శిని , రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు హెచ్చరించారు. పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాల ఆవరణలో గురువారం పట్టణ మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇంటి స్థలాలు కేటాయించాలని నాలుగు విడతల్లో 4వేల మందితో తహసీల్దార్లకు వ్యక్తిగత దరఖాస్తులు ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేదలకు స్థలంతో పాటు నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పు రుణం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబాపక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల పట్టణ ఏపీ మహిళా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా సరోజమ్మ, రమాదేవి, ప్రధాన కార్యదర్శి సుశీలమ్మ, మరో 21 మంది ఎన్నికయ్యారు.

'2.0 విధానాన్ని రద్దు చేయాలి'


ధర్నా చేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉపయోగించే 2.0 విధానాన్ని రద్దు చేయాలని స్టాంప్స్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఫరూక్, రమేశ్ డిమాండు చేశారు. గురువారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ధర్నా చేపట్టారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మాలిక్, శివరాం, సంజీవ్‌రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కబడ్డీ శిక్షణ ప్రారంభం

పాణ్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు శిక్షణా క్యాంపు గురువారం పాణ్యం, గడివేములలో ప్రారంభమైనట్లు ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన మాట్లా డుతూ ఆంధ్రకబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ జట్టులోని బాలురకు గడివేములలో, బాలికలకు పాణ్యంలో ఈనెల 22 వరకు శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. విజయాని కేతన్ పాఠశాల కరస్పాండెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్యశాలల తనిఖీ

పాములపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకందాల, పాములపాడు పశు వైద్యశాలలను సహాయ సంచాలకులు వెంకటేశ్వరరావు ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం స్థానిక పశు వైద్యాధికారి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంట్ల టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి యోజన పథకం ద్వారా బ్యాంకులలో బీమా చెల్లింపులు చేయడం ద్వారా కుటుంబానికి సురక్షగా ఉంటుందని ఆర్బీఐ ఎల్‌డీవో ఎ.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటరమణ అవగాహన కల్పించారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో గురువారం సచివాలయం ప్రాంగణంలో జనసురక్ష సాచ్యురేషన్ క్యాంపు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 18 నుంచి 50 ఏళ్లలోపు ప్రతి ఒక్కరూ బ్యాంకుల ద్వారా అందించే ప్రధాన మంత్రి బీమా పథకాలకు రూ.20 చెల్లిస్తే ప్రమాద బీమా రూ.2 లక్షలు, రూ.436 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2లక్షల బీమా నామినీకి వస్తుందని చెప్పారు. అనంతరం బ్యాంకులు అందించే రుణ సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో లీడ్ జిల్లా మేనేజర్ రవీంద్రకుమార్, బ్యాంకు మేనేజర్ మల్లికార్జున రెడ్డి, ఎస్‌ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నబీరసూల్, పంచాయతీ కార్యదర్శి మీనా కుమారి, ఆత్మకూరు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు బాక్సింగ్ జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జిల్లా బాలబాలికల బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేం కార్యదర్శులు విశ్వనాథ్ ఆశాజ్యోతి తెలిపారు. అండర్ 14 ,17 విభాగంలో ఎంపికైన బాలబాలికల జట్లు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొంటా యన్నారు. బాక్సింగ్ కిట్లు స్వయంగా తెచ్చుకోవాలన్నారు. అర్హత పత్రంలో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుల సంతకాలు చేపించుకొని రావాలన్నారు. అలాగే మిడ్డే మీల్స్ పత్రాన్ని కూడా తీసుకొని రావాలన్నారు.

నీటి కుంట కాదు.. మున్సిపల్ స్థలం



ఈ చిత్రం చూడాగానే నీటికుంట అని.. అందులో గేదెలు హాయిగా సేదదీరుతున్నాయని చాలామంది భావించే ఉంటారు. అయితే ఇది నీటి కుంట కాదు.. నంద్యాల పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలోని మున్సిపల్ స్థలం. వర్షపు నీరు నిల్వతో ఖాళీ స్థలం ఇలా తయారయింది. మురుగు కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. పైగా దోమలకు నిలయంగా మారింది. దీంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు విలువ చేసే ఈ స్థలాన్ని ఇలా వదిలేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

\- నంద్యాల హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)

హామీలు నెరవేర్చాలి

గ్రామ రెవెన్యూ సహాయకుల డిమాండ్


పాములపాడులో ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

పాములపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు గ్రామ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు ధర్నా నిర్వహించారు. గురువారం పాములపాడు రెవెన్యూ కార్యాలయం వద్ద రెవెన్యూ సహాయకుల సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్వరుడు మాట్లాడుతూ ప్రభుత్వం నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయాలని, రూ.21 వేలు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: గ్రామ రెవెన్యూ సేవకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అలాగే 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ రెవెన్యూ సేవకుల సంఘం జిల్లానాయకులు మహేశ్, శివన్న, దర్గయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ సేవకులతో దీక్షా శిబిరంలో ధర్నా చేపట్టారు. నిరసనలు రెండు రోజుల పాటు కొన సాగుతాయని నాయకులు చెప్పారు. వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా, అటెండర్లుగా, వాచ్‌మన్లుగా, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్ర వీఆర్వో సంఘం నాయకులు ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి అయిన రాగిని నరసరాజు, వీఆర్వోలు స్వాములు, స్వామన్న, మనోహర్‌గౌడ్, ఆనంద్ వారితో పాటుగా వామపక్ష నాయకులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు.

బంగారం దుకాణంలో చోరీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారం దుకాణంలో రూ.2లక్షల విలువైన ఆభరణం చోరీ అయినట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలివీ.. బైర్మల్ వీధిలోని డీఎస్‌ఎం బంగారు దుకాణంలో గురువారం ఒక గుర్తు తెలియని మహిళ మాస్క్ పెట్టుకుని వచ్చి చిన్న పిల్లలకు ఉంగరం కావాలని అడిగింది. దీంతో సిబ్బంది అన్ని రకాల ఉంగరాలు చూపించారు. అలాగే మిగతా ఆఅభరణాలు కూడా చూస్తూ నటించి ఒక ఆభరణం (నెక్లెస్) దొంగిలించి నాకు ఏవి నచ్చలేదని వెళ్లిపోయింది. దీంతో గంట తర్వాత బంగారు అభరణం కనిపించలేదని తెలుసుకున్న సిబ్బంది మహిళను వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వన్‌టౌన్‌లో బాధితుడు మహ్మద్‌బాషా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బార్ ఏర్పాటు వద్దు


ధర్నా చేస్తున్న సలీం నగర్ వాసులు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బార్ అండ్ రెస్టారెంట్ తమ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని నంద్యాల సలీం నగర్ ప్రజలు డిమాండు చేశారు. గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. అబులైస్, రెహంతుల్లా, ఇక్బాల్ మాట్లా డుతూ ఇక్కడ మసీదులు, ఆసుపత్రులు ఉన్నాయని, దీంతో చాలా మంది ఇబ్బందులు పడతారని అన్నారు. మహిళలు ఇబ్బందులు పడతా రన్నారు. కౌన్సిలర్ చింపింగ్ బాసిత్, మౌలాలి, సర్దార్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి


తహసీల్దార్లు, నాయకులతో సమావేశమైన ఎన్నికల అధికారి

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పారదర్శకతను పాటించాలని, ఎటువంటి తప్పులకు తావివ్వకుండా జాగ్రత్త పడాలని నందికొట్కూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, తహహసీల్దార్ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. గురువారం నందికొట్కూరు తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ జాబితాపై, ఓటింగ్ సరళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లె, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల మండలాల తహసీల్దార్లు ఉమారాణి, సుభద్ర, చెంద్రశేఖర్‌నాయక్, శ్రీనివాసులు, శివరాముడు, నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని అటవీ సమీప గ్రామాలైన పెద్దగుమ్మడాపురం, చిన్న గుమ్మడాపురం, సింగరాజుపల్లి గ్రామాల్లో అటవీ జంతువుల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు రాజశేఖర్, గంగన్న, సుబ్బరాయుడు కోరారు. ఆత్మకూరు ఇన్‌చార్జి రేంజ్ అధికారి కృష్ణప్రసాద్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు లక్ష్మీరెడ్డి, వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి, శ్రీను, చిన్న, రాజు, స్వాములు తదితరులు ఉన్నారు.

యోగా సాధన చేయాలి


యోగా సాధన చేస్తున్న మహిళలు

శ్రీశైలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుండలి యోగా సాధన చేయాలని, దీనివల్ల ఆరోగ్యంగా ఉంటారని యెగా గురువు జీవేశ్వర యోగి గురువు అన్నారు. శ్రీశైలంలోని పద్మశాలి నిత్యన్నదాన సత్రంలో యెగా సాధన శిక్షణ కార్యక్రమాలు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుండలిని సాధన చేసేందుకు ఏపీ, తెలంగాణ, అమెరికా, చైనా, ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో శ్రీశైలం చేరుకోని సాధనలో నిమగ్నమయ్యారని చెప్పారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ

పాణ్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ కరాటే పోటీ లలో శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిరపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన కర్నూలులో జరిగిన 12వ జీకేఎంఏ జాతీయ కరాటే పోటీలలో విద్యార్థి ఇర్ఫాన్ అండర్-18 విభాగంలో విజయం సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని కళాశాల అధ్యాపకులు అభినందిం చారు. ఏఐఎంఎల్ హెచ్‌వోడీ డేవిడ్, పీడీ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఏషియన్ ఇంటర్నేషనల్ తైక్వాండోలో..

నందికొట్కూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గచ్చిబౌలి స్టేడియంలో ఫస్ట్ ఏషియన్ ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని నారాయణ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్ నాయుడు అండర్- 14, 80 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థిని సన్మానించింది. ప్రిన్సిపాల్ మాధవి, తైక్వాండో కోచ్ రాంబాబు ఉన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పగిడ్యాల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌కు చెందిన 30 మంది క్రీడాకారులకు దాతలు అందజేసిన దుస్తులను ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్ర కుమార్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మోహన్‌దాసు గురువారం అందజేశారు. వైసీపీ నాయకుడు పాలురు వెంకటేశ్వర్లు క్రీడాకారుల కోసం దుస్తులు సమకూర్చినట్లు తెలిపారు. పీతాంబరరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్జీఎం ప్రిన్సిపాల్‌కు జాతీయ అవార్డు

పాణ్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఏటా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) నిర్వహించే ఎడ్యుకేషన్ ఎక్స్‌లెంట్ అవార్డును ఈ ఏడాది ఆర్జీఎం ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, ఇంటర్న్‌షిప్ అవార్డును సీఎస్‌సీ హెచ్‌వోడీ డాక్టర్ సుబ్బారెడ్డి అందుకున్నారు. సిమ్లాలో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగిన ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ జాతీయ ప్రిన్సిపాల్‌గా ఆర్జీఎం ప్రిన్సిపాల్ ఎంపికయ్యారని కళాశాల డీన్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. స్టూడెంట్స్ ఇంటర్న్‌షిప్ జాతీయస్థాయిలో ఏడో స్థానం సాధించి కళాశాల ఇంటర్న్‌షిప్ అవార్డును సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ సుబ్బారెడ్డి అందుకున్నా రన్నారు. ఈ అవార్డును నాలుగోసారి కళాశాలకు దక్కినట్లు తెలిపారు. నేషనల్ బోర్డ్ అక్రిడిటేషన్ మాజీ చైర్మన్ కేకే అగర్వాల్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలను కళాశాల చైర్మన్ శాంతిరాముడు, ఎండీ శివరాంలు అభినందించారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని డాక్టర్ షహలం అన్నారు. మండలంలోని చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్థనారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు జబీన్, అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ చూపాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, సీహెచ్‌సీ సూపరింటెంట్ డాక్టర్ రాయుడు పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రం నందు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, వైద్యులు సుభాషిని, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం చేయాలి: కలెక్టర్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, మున్సిపల్, హౌసింగ్ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని ప్రతి అర్హత కల్గిన కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడం కోసమే పీఎంఏవై పథకమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ శేషన్న, హౌసింగ్ పీడీ శ్రీహరిగోపాల్‌తో కలిసి కలెక్టర్ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అంగీకార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ఆధార్, రేషన్‌కార్డు కల్గి ఎన్‌బీఎం పోర్టల్‌లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి పీఎంఏవై అర్బన్ - ఎన్టీఆర్ నగర్ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఇందుకోసం కేంద్రప్రభుత్వం రూ.1.5లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ రూ.1లక్ష కలిపి మొత్తం రూ.2.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 4న ఢిల్లీలో జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా సెప్టెంబరు, అక్టోబరు నెలలను హౌసింగ్ నెలలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఇల్లులేని పేదలను గుర్తించి గృహ యజమానులుగా చేయడం, బ్యాంక్ లోన్ సౌకర్యం కల్పించడం, రిజిస్ట్రేషన్ చేయించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ప్రధాన అంశాలుగా కొనసాగనున్నాయని వివరించారు.

నంద్యాల సబ్ డివిజన్‌లో 30 యాక్టు అమలు

నంద్యాల టౌన్, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 యాక్టు అమలులో ఉందని, ఎలాంటి ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు ఉండవని ఏఎస్పీ మందా జావళి గురువారం తెలిపారు. శుక్రవారం వైసీపీ నాయకులు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసిస్తూ చేసే కార్యక్రమానికి అనుమతి లేదని చెప్పారు. మెడికల్ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయని వాటిని ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు జరుగుతాయని, ఈనెల 30వ తేది వరకు ఉండడంతో వారికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాపారం చేసుకోవాలి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాపారం చేసుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. గురువారం స్థానిక మార్కెట్‌లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో బాగంగా మార్కెట్‌లోని పరిసరాలను శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు రావడానికి గానీ, మంచి కూరగాయలు అమ్మడానికి గానీ అవకాశం ఉంటుందన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

పాములపాడు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాములపాడులో రోగులకు, బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్స్, పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ ముందుగా మండల నాయకుడు మురళీమోహన్ ఆధ్వర్యంలో మోదీ జన్మదిన డేఉకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యడు చల్లా దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. నాయకులు గోపాలకృష్ణయ్య, నాగలింగమయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని పరివర్తన లైఫ్ సెంటర్‌లో విద్యార్థులకు అన్నదానం, నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మీల్ అమీర్, నాయకులు కృష్ణమోహన్, కిరణ్, లక్ష్మినారాయణ, శివ, పార్థుడు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు 'శక్తి యాప్'

మహానంది, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తోనే విద్యార్థులకు రక్షణ అని శక్తి టీం సభ్యులు తెలిపారు. గురువారం మహానంది మండలం ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు శక్తి యాప్ ఆవశ్యకత గురించి టీం సభ్యులు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ళ నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వారోత్సవాలు ప్రారంభం

పాణ్యం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫార్మా కో విజిలెన్స్ వారోత్సవాలు శాంతిరాం ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రారంభమాయ్యియి. కళాశాలలో శాంతిరాం వైద్యశాల, వైద్య కళాశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కళాశాల డీన్ అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ జానకి, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి: జీసీడీవో


పాణ్యంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో

పాణ్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జీసీడీవో సువర్చల ఆదేశించారు. గురువారం ఆమె పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరంగా భోజనం అందించాల న్నారు. తగిన మోతాదులో కందిపప్పు, నూనె, నాణ్యమైన కూరగాయలు వాడాలన్నారు. గడువు తేదీ ముగిసిన వస్తువులు వాడకూడదన్నారు. విద్యార్థులు పాఠశాలలో భోజనం తినాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సంఘానికి జాతీయ పురస్కారం

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఇండియా కానిస్టిట్యూషన్ క్లబ్ వేదికపై గత ఆదివారం జాతీయ ఫిజియోథరపీ సంఘం ఆధ్వర్యంలో మూడో జాతీయ సదస్సు నిర్వహించారు. నంద్యాల జిల్లా ఫిజియో థెరఫిస్టుల సంఘానికి ఫిజియోథరఫిపై ప్రజా అవగాహన కార్యక్రమాలు, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు, ఉచిత శిబిరాలు, నిర్వహించడంతో జాతీయ స్థాయిలో ఆరు పురస్కారాలు అందించారు. దక్షిణ భారతదేశంలో ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక జిల్లా నంద్యాల జిల్లా ఫిజియోథెరపీ సంఘం కావడం విశేషం. ఈ పురస్కారాన్ని పార్లమెంట్ సభ్యులు బన్సూరి స్వరాజ్ , రాజీవ్ భరద్వాజ్, జాతీయ ఫిజియోథెరపీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్ కుమార్ చేతుల మీదుగా నంద్యాల జిల్లా శాఖ తరపున డాక్టర్ కాటసాని శివబాలిరెడ్డి , డాక్టర్ రోహిణి విజయ్ స్వీకరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మహిళల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యం

డోన్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తోందని డీసీహెచ్ఎస్ అధికారిణి, జిల్లా ఏరియా ఆసుపత్రుల సమన్వయకర్త లలిత అన్నారు. గురువారం స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

రుద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని రుద్రవరం తహసీల్దారు కార్యాలయం ముందు గురువారం వీఆర్ఏలు ధర్నా చేశారు. అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వో, అటెండరు, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. నామినీ వీఆర్వోలను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. 19 గ్రామాలకు చెందిన వీఆర్ఏలు పాల్గొన్నారు.

కంపోస్టు పిట్ల నిర్మాణం పూర్తి చేయండి: పీడీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కంపోస్టు పిట్ల నిర్మాణాన్ని త్వరగతిన పూర్తి చేయించాలని జిల్లా ఉపాధి హామీ పీడీ సూర్యనాయణ పేర్కొన్నారు. గురువారం ఉపాధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో బాగంగా మండలానికి 1,610 టార్గెట్ ఇచ్చామన్నారు. రెండు వారాల్లో కంపోస్టు పిట్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

వైసీపీ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమం


మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేశామని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైసీపీ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనర్ సీహెచ్ చలంరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వరరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ మండలంలో భారీ వర్షం


చెరువును తలపిస్తున్న రూపనగుడి బస్టాండు ఆవరణం


ఉయ్యాలవాడలో మిరప పంటలో నిలిచిన వర్షపు నీరు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. మండలంలో 127.78 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉయ్యాలవాడ, ఇంజేడు, రూపనగుడి, హరివరం, కొండుపల్లె, ఆర్.పాంపల్లె, సర్వాయిపల్లె, ఆర్.జంబులదిన్నెలో రహదారులపై వరదనీరు ప్రవహించింది.

నిలిచిపోయిన రాకపోకలు

కుందరవాగు వంతెనపై వరద నీరు ప్రవహించడంతో ఆళ్లగడ్డ-మాయలూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలోకి భారీ ఎత్తున నీళ్లు వచ్చి చేరటంతో పాఠశాలకు సెలవు ప్రకటించారు.

హరివరం గ్రామంలో ఇళ్లలోకి చేరిన నీరు

పొలాల్లోని నీరంతా హరివరం గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి వచ్చి చేరింది. ఇళ్లలోని ధాన్యం, బట్టలు, వస్తువులు అన్ని తడిచి పోయాయి. తహసీల్దారు ప్రసాద్‌బాబు, ఎంపీడీవో ఉమామ హేశ్వరరావు, ఎస్ఐ రామిరెడ్డి బియ్యం, కందిపప్పు, నూనె, కురగాయలు అందజేశారు.

నీట మునిగిన పంట పొలాలు

ఆర్.పాంపల్లె, హరివరం, ఉయ్యాలవాడ గ్రామాల్లో వరి, మిరప, పత్తి పంటలు నీట మునిగాయి. మిరప, పత్తి మొక్కలు కుళ్లి పోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కుంగిపోయిన మట్టి మిద్దెలు

ఆయా గ్రామాల్లో 11 మట్టి మిద్దెలు కూలి పోయాయి. ఆర్.పాంపల్లె, పెద్దయమ్మనూరు, నర్సిఎల్లె గ్రామాల్లో మూడు చొప్పున, పడిగెపాడు గ్రామంలో రెండు మిద్దెలు కూలి పోయాయి. ఎలాంటి ప్రమాదమూ జరగలేదు.

బాధితులకు పరామర్శ

బాధిత కుటుంబాలను టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాంత్‌రెడ్డి పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుం టామని భరోసా ఇచ్చారు. కలెక్టర్‌తో మాట్లాడి వారికి తక్షణ సహాయం అందించాలని కోరారు.


ఆర్.పాంపల్లెలో కూలిన మట్టి మిద్దె

దెబ్బతిన్న నేలంపాడు రహదారి


కోతకు గురైన నేలంపాడు రహదారి

చాగలమర్రి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నేలంపాడు ప్రధాన రహదారి కోతకు గురైంది. గొట్లూరు నుంచి నేలంపాడుకు వెళ్లే రహదారిపై భారీ గుంతలు పడ్డాయి. వాహనదారులు, రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు.

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల ఎస్సీ కాలనీకి వెళ్లే


కుంగిన రహదారిని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రధాన రహదారి కుంగిపోవడంతో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప గురువారం పరిశీలించారు. వెంటనే మరమ్మతులను చేపడతామన్నారు. సర్పంచ్ సుభహాన్ అలీ, ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, ఇన్‌చార్జి ఈవో అశ్విన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన పనుల పరిశీలన

చాగలమర్రి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో కొత్తగా రూ.22.50 లక్షలు నిధులతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాములపాడు, సంజామల, ఆర్ఎస్ రంగాపురంలో గ్రంథాలయ భవన పనులు జరుగుతున్నాయన్నారు. డోన్‌లో రూ.90 లక్షలతో గ్రంథాలయ భవనం మంజూరైందన్నారు. గ్రంథాలయ అధికారి రామచంద్రుడు తదితరులు ఉన్నారు.

హెల్మెట్ తప్పని సరి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 18(ఆంధ్ర జ్యోతి): హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జురెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జమ్మల మగుడు రహదారిలో వాహనాల తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోతురాజు స్వామి విగ్రహం ధ్వంసం

రుద్రవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమాయపల్లెలోని మారెమ్మ దేవాల యంలో ఉన్న పోతురాజుస్వామి విగ్రహాన్ని గుర్తు తెలి యని దుండగులు ధ్వంసం చేసినట్లు గురువారం స్థానికులు తెలిపారు. పోతురాజు స్వామి విగ్రహం పీఠం వద్ద రాడ్లుతో ధ్వంసం చేసి పగలగొట్టారు. పీఠం కింది భాగంలో దాడి చేయడంతో పోతురాజు స్వామి విగ్రహం విరిగిపడినట్లు స్థానికులు తెలిపారు. సుమారు 17 ఏళ్ల క్రితం ఈ విగ్రహాన్ని ప్రతిష్టగావించారు. విగ్రహం ధ్వంసం చేయడంతో గ్రామంలోని ప్రజలు ఆందోళన పడుతున్నారు.


దుండగులు ధ్వంసం చేసిన విగ్రహం

ఘనంగా ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు

- రక్తదాన శిబిరాల నిర్వహణ, అన్నదాన కార్యక్రమాలు
- పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ
- కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేసిన కోట్ల అభిమానులు



కోట్ల జన్మదినం సందర్భంగా భారీ కేక్ కట్ చేస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి.. దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి 74వ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కోట్ల అభిమా నులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తనయుడు, టీడీపీ యువ నేత కోట్ల రాఘవేంద్రరెడ్డి హాజరై కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా కోట్ల రాఘ వేంద్ర రెడ్డి మాట్లాడుతూ కోట్ల కుటుంబం ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, లక్క సాగరం లక్ష్మీరెడ్డి, కోట్రికే హరికిషన్, పెద్దకేశవయ్య గౌడు, శేషఫణి గౌడు, ఎల్లగౌడు, టీఈ రాఘవేంద్రగౌడు, ఆర్ఈ నాగరాజుగౌడు, వెంకట నారాయణ గౌడు, రేగటి అర్జున్ రెడ్డి, విజయభట్టు, వై.నాగరాజు గౌడు, ఓంప్రకాష్, తిమ్మయ్య యాదవ్, చం ద్రపల్లి శ్రీనివాసులు యాదవ్, మిద్దెపల్లి గోవిందు, చనుగొండ్ల శ్రీరాములు, గోసానిపల్లె మల్లయ్య, రంగ నాయకులు, గోవిందరాజులు, పవన్ కుమార్ రెడ్డి, ఈశ్వరయ్య, వలసల బాలుడు, వలసల సుధాకర్, బీజేపీ నాయకులు సందు వెంకటరమణ, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, గడ్డం బ్రహ్మం, రవీంద్ర, షేక్ అజీజ్, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

- పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ డా.హనీఫ్, డా.రమ్యశిల్ప రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోట్ల అభిమానులు రక్తదానం చేశారు. రక్తదాతలను కోట్ల రాఘవేంద్రరెడ్డి పండ్లు, స్వీట్లు అందించారు.
- వలసల గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, వలసల బాలుడు, వలసల సుధాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి హాజరై పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్నమల్కాపురం రామాంజనేయులు నాయుడు, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- అన్న క్యాంటీన్‌లో కోట్ల అభిమానులు ఓంప్రకాష్, రవీంద్ర, అజీజ్, కబీర్, జావీద్, రహంతుల్లా ఆధ్వర్యంలో తమ సొంత ఖర్చులతో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సుమారు 2వేల మందికి అన్నదాన నిర్వహించారు.
- కాగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. తిరుపతిలో కోట్ల అభిమాని మబ్బు దేవ నారాయణరెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.
- పట్టణ సమీపంలో ఉన్న సాయిబాబా గుడిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కేడీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వర రావు యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కొమ్మేరి వెంకట్రాముడు, చంద్రపల్లె లక్ష్మీనారాయణ యాదవ్, సి.నాగేశ్వరరావు, భాస్కర్, బాలు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీఈ కేశన్న గౌడ్ ఆధ్వర్యంలో...

పట్టణంలోని సమైక్యాంధ్ర కట్ట వద్ద అన్నదానం నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు సమక్షంలో టీడీపీ నాయకులు టీఈ రాఘవేంద్రగౌడు ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. టీడీపీ యువ నేత కోట్ల రాఘవేంద్రరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

లెప్రసీ, అంధుల కాలనీల్లో అన్నదానం

టీడీపీ నాయకులు కొత్తకోట శ్రీను, కొత్తపల్లె రంజిత్ కిరణ్, మధు, రామాంజనేయులు, గోసానిపల్లె మల్లయ్య ఆధ్వర్యంలో వారి సొంత ఖర్చులతో అన్నదానం నిర్వహించారు.

ప్యాపిలి: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. అనంతరం బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ఖాజాపీర్, బత్తుల రమేష్‌రెడ్డి, రామ్ కుమార్, శ్రీకాంత్, పరమేష్, ఆర్ఈ నాగరాజు, బట్టాసత్యం, ప్రసాద్ రెడ్డి, రాజశేఖర్, క్రిష్ణారెడ్డి, శ్రీరాములు, రాంభూపాల్, రామ్మోహన్, చల్లా వీరాంజినేయులు, మధు, నాగేంద్ర, కుమ్మరి సుధాకర్, రమణగౌడు, నబీరసూల్, కొంగనపల్లి మధు, రాజా రవి పాల్గొన్నారు.

బేతంచెర్ల: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, భీమేశ్వరరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. బుగ్గన ప్రభాకర్ రెడ్డి, మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బేతంచెర్ల: కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్న లక్ష్మి




డోన్: అన్నదానం చేస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి.. తిరుపతిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల.. ప్యాపిలిలో కేక్ కట్ చేస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి



వరద బాధితులను ఆదుకుంటాం

చాగలమర్రి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా వరద బాధితులను ఆదుకుంటామని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి భరోసా ఇచ్చారు. భారీ వర్షాలకు జలమయమైన నేలంపాడు గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. నీట మునిగిన పంట పొలాలు, గృహాలకు పరిహారం అందిస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉధృతంగా వకుళా నది

ఆళ్లగడ్డ, సెప్టెంబర్ 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు వకుళా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆళ్లగడ్డ నుంచి అహోబిలం, ఓబులంపల్లె రాకపోకలకు అంతరాయం కలిగింది. కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, డీఎస్పీ ప్రమోద్, కమీషనర్ కిషోర్, టౌన్ సీఐ యుగంధర్ అధికారుల బృందం సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

బాలికలు క్రీడల్లో రాణించడం హర్షణీయం

అవుకు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలికలు క్రీడల్లో రాణించటం హర్షణీయమని రోడ్లు భవనాలు శాఖ మంత్రి సతీమణి బీసీ ఇందరమ్మ గురువారం అన్నారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థిని రిజ్వానను ఇందిరమ్మ అభినందించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దవెంతుర్ల సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి, ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు గురువారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2500 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి : మంత్రి బీసీ

బనగానపల్లె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వైద్యులను ఆదేశించారు. అవసరమైతే జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక


కె. శేఖర్


జె.మల్లికార్జున


ఎం.ఎం మురళి


కళ్యాణ్ కుమార్

డోన్ టౌన్, సెప్టెంబరు 18 : (ఆంధ్రజ్యోతి): డోన్ అక్రిడిటేషన్ జనరలిస్టు యూనియన్ (డీఏజేయూ) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు డీఏజేయూ గౌరవాధ్యక్షుడు విజయ మోహన్‌నాయుడు, ముత్యాల శివరామయ్య ఆచారి తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో డోన్ అక్రిడిటేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే.శేఖర్, కార్యదర్శులుగా మల్లికార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంఎం.మురళి, కోశాధికారిగా కళ్యాణ్ కుమార్, గౌరవ సలహాదారులుగా వి.నాగరాజు, మోహన్, రాజు, పాధ్యక్షులుగా వెంకటేశ్, సుధాకర్ యాదవ్, సహాయ కార్యదర్శులుగా మణిధర్, నాగరాజు, సభ్యులుగా లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, బాలరాజు, సుధాకర్, తారక్, శేఖర్ రెడ్డి, రవి, వలిబాషా, న్యాయ సలహాదారుడుగా సుధాకర్ యాదవ్‌తో పాటు మరి కొంతమందిని ఎన్నుకున్నారు.